నమస్తే తెలంగాణ
వరంగల్ హనుమకొండ
5 | బుధవారం 20 మార్చి 2024 | WARANGAL HANUMAKONDA

## 'పది'లో నలుగురు విద్యార్థులు డిబార్

**గణపురం మోడల్ స్కూల్ సెంటర్‌లో ఘటన**

భూపాలపల్లి రూరల్/గణపురం, మార్చి 19 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు పదో తరగతి విద్యార్థులు డిబార్ అయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిర్వహించిన టెన్త్ హిందీ పరీక్ష సందర్భంగా గణపురం మండలంలోని మోడల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం సందర్శించి తనిఖీలు చేపట్టింది. ఈ క్రమంలో నలుగురు విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడుతుండగా పట్టుకొని వారిని డిబార్ చేసింది. అలాగే విధుల్లో నిర్లక్ష్యం వహించిన చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి, ముగ్గురు ఇన్విజిలేటర్లను బాధ్యతల నుంచి తొలగించింది. కాగా, జిల్లాలోని 20 కేంద్రాల్లో 3,546 మంది విద్యార్థులకు 3,534 మంది పరీక్ష రాశారని, 12 మంది గైర్హాజరయ్యారని డీఈవో తెలిపారు. భూపాలపల్లి మండలంలోని నాలుగు సెంటర్లను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ పరీక్షల నియంత్రణాధికారి మందల రవీందర్‌రెడ్డి సందర్శించినట్లు ఆయన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

# వరంగల్‌లో ఎగిరేది గులాబీ జెండానే

- ఇందుకోసం ప్రతి కార్యకర్త కృషిచేయాలి
- కలసికట్టుగా కావ్యను గెలిపిద్దాం
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ, మార్చి 19 : రానున్న వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండానేనని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. హనుమకొండ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన వర్ధన్నపేట నియోజకవర్గ ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్ధన్నపేట తన సొంత నియోజకవర్గమైనా ఇన్ని రోజులు కార్యకర్తలకు దగ్గరగా రాలేకపోయానన్నారు. పార్టీ కట్టుబాట్లకు లోబడి నియోజకవర్గ ప్రజలు, నాయకులకు దూరంగా ఉన్నానని తెలిపారు. బీఆర్‌ఎస్ నుంచి వరంగల్ ఎంపీ అభ్యర్థిగా నిలబడిన తన కూతురు కడియం కావ్యకు ఓటు వేయాలని అడిగేందుకు మీ ముందుకు రాలేదన్నారు. పార్టీ కుటుంబ సభ్యులకు భరోసా కల్పించేందుకు వచ్చానని తెలిపారు. వర్ధన్నపేట ప్రజలకు కడియం శ్రీహరి ఎల్లవేళలా అందుబాటులో ఉంటాడని చెప్పారు. పార్టీ అవసరాలకు అనుగుణంగా ఎక్కడికైనా వచ్చేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్‌కు బీఆర్‌ఎస్ పార్టీ చేసిన అన్యాయం ఏమిటని కడియం ప్రశ్నించారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చినట్లు చెప్పారు. పదేళ్లలో పార్టీని కొంత నిర్లక్ష్యం చేసిన వాస్తవమేనని, పార్టీ నిర్మాణంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకొని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ వంద రోజుల పాలన ఎలా ఉందో ప్రజలకు అర్థమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలు అసలు అమలు కాలేదన్నారు. తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని, ఇప్పటివరకు తాను ఎవరినీ మోసం, ద్రోహం చేయలేదన్నారు. తాను ఎంత నిజాయితీగా పనిచేస్తానో తన బిడ్డ కావ్య కూడా అంతే నిజాయితీగా పనిచేస్తుందని కడియం అన్నారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని అన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గానికి తాను ఇన్‌చార్జిగా ఉంటానని తెలిపారు. త్వరలోనే నియోజకవర్గ కమిటీలు వేసుకొని పార్టీని, కార్యకర్తలను కాపాడుకుంటామన్నారు. కలిసికట్టుగా పనిచేసి కడియం కావ్యను గెలిపిద్దామని కడియం శ్రీహరి పిలుపునిచ్చారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, కడియం కావ్య

# బీజేపీ, కాంగ్రెస్ విష ప్రచారం

**నేను పార్టీ వీడే ప్రసక్తే లేదు**

- ఎన్నికల కోసమే కాంగ్రెస్ డ్రామా
- బీఆర్‌ఎస్‌ను కాపాడుకుంటాం
- కార్యకర్తలు అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం
- కాంగ్రెస్ 100 రోజుల పాలన ఫెయిల్
- ఫోన్ ట్యాపింగ్, వార్‌రూంతో సంబంధం లేదు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- నేను ఫుల్ టైం పొలిటీషియన్‌ను : బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- అందరి సహకారంతో తప్పక గెలుస్తా : కడియం కావ్య

'కాంగ్రెస్, బీజేపీలు కావాలనే నాపై విష ప్రచారం చేస్తున్నారు. కార్యకర్తలను తప్పుదోవ పట్టించేందుకు ఇలా దుష్ప్రచారం చేస్తున్నారు.. వాటిని నమ్మొద్దు. నేను బీఆర్‌ఎస్ పార్టీని వీడే ప్రసక్తే లేదు. అధినేత కేసీఆర్ సారథ్యంలో పార్టీ బలోపేతం కోసం ఒక సైనికుడిలా పనిచేస్తా'నని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టంచేశారు. మంగళవారం హనుమకొండ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గ సమావేశం ఏర్పాటుచేయగా స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిలతో కలిసి ఎర్రబెల్లి పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడుతూ తాను బీజేపీలో చేరబోతున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమని కొట్టిపారేశారు.
– హనుమకొండ, మార్చి 19

కాంగ్రెస్, బీజేపీలు కావాలనే తనపై విషప్రచారం చేస్తున్నాయని ఎర్రబెల్లి మండిపడ్డారు. గతంలో వైఎస్సార్సీపీలోకి రావాలని అనేక ఇబ్బందులు పెట్టినా తాను పార్టీ మారలేదని గుర్తుచేశారు. వ్యాపారాలు, భూ దందాలు, తప్పుడు పనులు చేసిన నాయకులు బీఆర్‌ఎస్‌ను వీడుతున్నారని, కార్యకర్తలు అధైర్యపడొద్దని, పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ కాపాడుతుందని హామీ ఇచ్చారు. మార్పు కావాలని కోరుకున్న ప్రజలు కాంగ్రెస్ పార్టీ వంద రోజుల పాలన చూసి బీఆర్‌ఎస్‌ను ఓడించి తప్పు చేశామని అనుకుంటున్నారని ఎర్రబెల్లి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుకాగానే రుణమాఫీ చేస్తాం, రైతుబంధు ఇస్తామని మోసం చేశారన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా రూ.2500 ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల్లో ఇప్పటివరకు రెండు పథకాలు మాత్రమే అమలుచేశారని ఆయన ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల వేళ ఉచిత కరెంటు, రూ.500లకే గ్యాస్ అని చెప్పి ప్రజలను ఎన్నికలు అయిపోయిన వెంటనే ఈ స్కీమ్‌లను ఎత్తేస్తారని ఎర్రబెల్లి అన్నారు. కాంగ్రెస్ వంద రోజుల పాలన ఫెయిల్ అయిందని ప్రజలు అనుకుంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల కోసమే కాంగ్రెస్ పార్టీ డ్రామాలు ఆడుతున్నదన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డికి మొదటి నుంచీ మాయమాటలు చెప్పడం, మోసాలు చేయడం అలవాటేనని అన్నారు. వంద రోజుల పాలనలో పంటలు ఎండిపోయాయి, కరెంటు రావడం లేదు, తాగునీరు అందడం లేదని, ఇందుకు కారణం కాంగ్రెస్ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. ఎండిపోయిన పంటలకు రూ.20వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మండు వేసవిలోనూ చెరువులు నింపిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. గెలుపోటములు సహజమని, ఎన్టీఆర్‌లాంటి నాయకుడికి సైతం ఓటమి తప్పలేదని ఎర్రబెల్లి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌ను బలహీనపర్చేందుకు కాంగ్రెస్, బీజేపీలు కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నాయని దయాకర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

### కేసీఆర్‌కు కృతజ్ఞతలు

తనపై నమ్మకంతో వరంగల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పేరును ప్రకటించినందుకు పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు కడియం కావ్య కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ వంద రోజుల పాలన గురించి ప్రజల్లో చర్చ జరుగుతున్నదన్నారు. నాయకులు పోయినా కార్యకర్తలు అధైర్యపడొద్దన్నారు. స్వరాష్ట్ర ప్రయోజనాల కోసం ఏర్పాటైన పార్టీ బీఆర్‌ఎస్ అని, అందరి సహాయ సహకారాలతో తప్పకుండా గెలుస్తానని కడియం కావ్య ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవా రెడ్డి, రైతుబంధు కమిటీ మాజీ అధ్యక్షురాలు లలితాయాదవ్, వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పశ్చిమ నియోజకవర్గం సీనియర్ నాయకులు పులి రజినీకాంత్, జోరిక రమేశ్, నయీముద్దీన్, సారంగపాణి, జానకిరాములు, రవీందర్‌రావు పాల్గొన్నారు.

### నేను ఫుల్ టైం పొలిటీషియన్‌ను..

నేను ఫుల్‌టైం పొలిటీషియన్‌ను అని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. పార్ట్‌టైం పొలిటీషియన్లు పార్టీ మారినా నష్టం లేదన్నారు. కేసీఆర్ ఫొటోతో గెలిచిన నాయకులు ఇప్పుడు పార్టీ ఓడిపోవడంతో అధికారం కోసం మారుతున్నారని అన్నారు. పార్టీ మారిన నాయకులతో క్యాడర్ పోవట్లేదని వర్ధన్నపేట నియోజకవర్గ గులాబీ సైనికులను చూస్తేనే అర్థం అవుతుందని పేర్కొన్నారు. పచ్చని చెట్టుకు ఎండిపోయిన ఆకులు రాలిపోయినా మళ్లీ చెట్టు చిగురిస్తుంది, కాయలు కాస్తాయి.. ఆ ఫలాలను కష్టకాలంలో పార్టీ వెన్నంటి ఉన్నవారికే అందేలా అధిష్ఠానం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను విశ్లేషించుకున్నామని తెలిపారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ఎండిన పొలాలు, కాలిపోతున్న మోటర్లు కనిపిస్తున్నాయని, ఆటో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకులపై కాంగ్రెస్ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని.. ప్రజల పక్షాన పోరాడుతామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని చోటే భాయ్, కేంద్రంలోని బడే భాయ్ కలిసి కేసీఆర్ మీద కుట్ర పన్నుతూ, బీఆర్‌ఎస్ పార్టీని దెబ్బతీయాలని చూస్తున్నారని దాస్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఒక శక్తిగా 60ఏండ్ల తెలంగాణ ప్రజల కలను సాకారం చేశారని గుర్తుచేశారు. చిన్న చిన్న పొరపాట్లను సర్దుకొని బలమైన శక్తిగా, ప్రజల మనోభావాలకు అనుగుణంగా బీఆర్‌ఎస్ పార్టీ పని చేస్తుందన్నారు. ఇప్పటి వరకు తనను గెలిపించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

### ఫోన్ ట్యాపింగ్, వార్‌రూంతో నాకు సంబంధం లేదు

ఫోన్ ట్యాపింగ్, వార్‌రూంతో తనకు ఎలాంటి సంబంధం లేని ఎర్రబెల్లి స్పష్టం చేశారు. ప్రణీత్‌రావు ఎవరో తనకు తెలియదన్నారు. ఆయన అమ్మమ్మ ఊరు, మా స్వగ్రామం పర్వతగిరి అయినంత మాత్రాన ఇద్దరికీ సంబంధం ఉన్నట్టా అని దయాకర్‌రావు ప్రశ్నించారు. ఈ కేసులో తన పేరు చెప్పాలని ప్రణీత్‌రావు మీద ఒత్తిడి తెస్తున్నారని.. దేనికైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని చెప్పారు.





నెక్కొండలో కాలురాం పుర్బియాను విచారిస్తూ, ఐస్‌క్రీమ్ శాంపిల్స్ తీసుకుంటున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి, ఎస్సై మహేందర్

# ఐస్‌క్రీమ్‌లో వీర్యం.. మూత్రం

- నెక్కొండలో విక్రేత రోత పని
- వీడియో వైరల్.. నిందితుడి అరెస్ట్
- శాంపిల్స్ సేకరించిన ఫుడ్ ఇన్‌స్పెక్టర్

నెక్కొండ, మార్చి 19 : ఐస్‌క్రీమ్‌ను తలుచుకుంటేనే వాంతిచేసుకునేంత పనిచేశాడో ప్రబుద్ధుడు.. ఏం పైత్యమోగానీ.. ప్రజలకు అమ్మే ఐస్‌క్రీమ్‌లో తన వీర్యాన్ని, మూత్రాన్ని కలిపాడు.. ఈ దారుణాన్ని చాటుగా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించిన ఓ వ్యక్తి.. సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో సదరు ప్రబుద్ధున్ని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వరంగల్ జిల్లా నెక్కొండలో రాజస్థాన్‌కు చెందిన కాలురాం పుర్బియా అనే వ్యక్తి ఐస్‌క్రీమ్ బండి పెట్టుకున్నాడు. అంబేద్కర్ కూడలిలో రోజూ ఐస్‌క్రీమ్‌లు విక్రయిస్తుంటాడు. బహిరంగంగానే తన వీర్యాన్ని, మూత్రాన్ని ఐస్‌క్రీమ్‌లో కలుపుతుండగా ఓ వ్యక్తి వీడియో తీశాడు. ఇది సోమవారం రాత్రి వైరల్ కావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఎస్సై మహేందర్ విచారణ చేపట్టి బహిరంగ ప్రదేశంలో హేయమైన చర్యకు పాల్పడ్డ కాలురాం పుర్బియాను మంగళవారం అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వరంగల్ జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ చేపూరి కృష్ణమూర్తి ఐస్‌క్రీమ్ బండికి సంబంధించిన శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు తరలించారు. పంచాయతీ కార్యదర్శి సదానందంతో కలిసి ఐస్‌క్రీమ్ బండిలోని ఐటమ్స్‌ను బయట పారబోయించారు. ఈ సందర్భంగా సీఐ చంద్రమోహన్ మాట్లాడుతూ బండ్లపై ఐస్‌క్రీమ్‌లు, తినుబండారాలు విక్రయించేవారు ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసేవారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి వ్యాపారాలు చేస్తున్నవారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బయట పదార్థాలకు దూరంగా ఉంటేనే మంచిదని తెలిపారు. నెక్కొండలో ఐస్‌క్రీమ్‌లు అమ్మేవారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి హెచ్చరికలు జారీచేశారు.



బూర్నపల్లిలో చక్కర్లు కొడుతున్న జెట్ విమానం

## మానేరు సమీపంలో జెట్ విమానం చక్కర్లు

**ఆందోళనలో సరిహద్దు గ్రామాల ప్రజలు**

టేకుమట్ల, మార్చి 19 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఓ జెట్ విమానం భూమికి అతి సమీపంలో చక్కర్లు కొడుతున్నది. గత వారం రోజులుగా రోజుకు 4–5 రౌండ్లు తిరుగుతున్నది. వివరాలిలా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం, పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలాలను విడదీసే మానేరు వాగు సరిహద్దు గ్రామాల పైనుంచి విమానం వారం రోజులుగా తిరుగుతున్నది. దీంతో ఎంపేడు, కుందనపల్లి, బూర్నపల్లి, వెంకట్రావ్‌పల్లి, ద్వారకాపేట, రామకృష్ణాపూర్(వీ), బోయినపల్లి, కలికోటపల్లి గ్రామాల ప్రజలు, రైతులు విమానం ఎందుకు తిరుగుతుందో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. అయితే భూగర్భ జలవనరుల శాఖ అధికారులు సర్వే చేస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. అయితే అధికారికంగా మాత్రం ఎలాంటి సమాచారం లేదు.

## అత్యాశకు పోతే ఖాతా ఖాళీ!

- రేటింగ్ ఇస్తే డబ్బులు ఇస్తామని మెయిల్‌కు మెసేజ్
- సైబర్ నేరగాడి ఉచ్చుకు చిక్కిన ప్రైవేట్ ఉద్యోగి
- రూ. 2.32 లక్షలు పోగొట్టుకున్న వైనం
- లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు

పోచమ్మమైదాన్, మార్చి 19: అత్యాశకు పోయి రూ. 2.32 లక్షలు పోగొట్టుకున్నాడు. రేటింగ్‌తోపాటు పెట్టుబడికి డబుల్ ఆదాయం ఇస్తామంటూ గుర్తుతెలియని వ్యక్తి పంపిన మెసేజ్‌కి ఓ ప్రైవేట్ ఉద్యోగి బలయ్యాడు. వరంగల్ నగరంలోని మట్టెవాడ సీఐ తుమ్మ గోపి కథనం ప్రకారం.. మట్టెవాడకు చెందిన యాద కౌశిక్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 14న తన వాట్సాప్‌కు ఓ సెల్ నంబర్ నుంచి 'నీకేమైనా పార్ట్‌టైమ్ జాబ్ కావాలా' అంటూ మెసేజ్ వచ్చింది. తనకు వద్దంటూ కౌశిక్ తిరిగి సమాధానం ఇచ్చాడు. ఈసారి అతడి మెయిల్‌కు 'నీవు గూగుల్ మ్యాప్ ఓపెన్ చేసి, గ్రాండ్ హయత్ ముంబై హోటల్‌కు రేటింగ్ ఇస్తే నీ ఖాతాలో డబ్బులు వేస్తాం' అంటూ మెసేజ్ పంపి నమ్మించాడు. ఆ మాటలను నమ్మిన కౌశిక్ రేటింగ్ ఇవ్వగా, తన ఖాతాలో కొన్ని డబ్బులు క్రెడిట్ చేశాడు. తర్వాత టెలిగ్రాం లింక్‌లో జాయిన్ కావాలని చెప్పి రేటింగ్ స్క్రీన్ పంపిస్తే 50 రూపాయల చొప్పున క్రెడిట్ చేస్తామని చెప్పగా.. 10 నుంచి 12 సార్లు రేటింగ్ ఇచ్చాడు. మరుసటి రోజు రూ. 2000 పెట్టుబడి పెడితే రూ. 2,800 వస్తాయని చెప్పాడు. దీంతో కౌశిక్ రూ. 2 వేలు చేశాడు. మళ్లీ రూ. 5 వేలు, రూ. 29 వేలు, రూ. 48 వేలు, రూ. 50 వేల చొప్పున పలుమార్లు కౌశిక్‌తో గుర్తుతెలియని వ్యక్తి డబ్బులు కట్టించుకున్నాడు. ఇవన్నీ తిరిగి రావాలంటే మరో రూ. 30 వేలు కట్టాలని చెప్పగానే అవి కూడా కట్టాడు. 'మీరు పంపిన డబ్బులను రేపు నీ ఖాతాలో జమ చేస్తాం' అని నమ్మించారు. అయితే, 16వ తేదీన రావాల్సిన డబ్బుల కోసం కౌశిక్ మెసేజ్ పెట్టాడు. చివరగా రూ. 68 వేలు కడితే మొత్తం డబ్బులు పంపిస్తానంటూ నమ్మబలికాడు. దీంతో మళ్లీ రూ. 68 వేలు పంపించి ఎదురుచూశాడు. ఇలా పలు వాయిదాలుగా కౌశిక్ మొత్తం రూ. 2,32,000 పంపించగా, నయాపైసా రాకపోవడంతో తాను మోసపోయానని బాధితుడు గ్రహించాడు. వెంటనే మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఎనుమాముల మార్కెట్ యార్డులో భద్రపరిచిన ఈవీఎంలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

## ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల తనిఖీ

హనుమకొండ, మార్చి 19 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్ట్రాంగ్ రూములలో భద్రపరిచిన ఈవీఎంలు, వాటికి సంబంధించిన రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. హనుమకొండ జిల్లాకు సంబంధించి ఈవీఎంల కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఆర్డీవోలు వెంకటేశ్, నారాయణ, తహసీల్దార్లు విజయ్ కుమార్, భాస్కర్, కలెక్టరేట్ ఏవో సత్యనారాయణ, ఎన్నికల విభాగం డీటీలు సంతోష్, శ్యాం కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు మణి, శ్యాంసుందర్, నేహాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# పాపం పసివాడు

- గోడను ఢీకొన్న కాంక్రీట్ మిక్సర్ వాహనం
- గోడ కూలి బాలుడి మృతి.. జగిత్యాల జిల్లా మేడిపల్లిలో ఘటన
- మహబూబాబాద్ జిల్లాలో విషాదం



గణేశ్(ఫైల్)

మేడిపల్లి, మార్చి 19 : కాంక్రీట్ మిక్సర్ వాహన డ్రైవర్ అజాగ్రత్తతో ఓ బాలుడి ప్రాణం పోయింది. నిర్లక్ష్యంగా రివర్స్ చేయడంతో గోడకు తగలగా, దాని పక్కన కూర్చున్న బాలుడి తలపై గోడ పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జగిత్యాల జిల్లా మేడిపల్లిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా వడ్డెరగూడెం గ్రామానికి చెందిన సంపంగి సంగీత, శ్రీను దంపతులకు కూతురు నిహారిక (7), కొడుకు గణేశ్ (4) ఉన్నారు. వీరు గత నెల రోజుల నుంచి కరీంనగర్‌లో కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. నాలుగు రోజుల నుంచి జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రంలో కొత్తగా నిర్మిస్తున్న ఎన్నమనేని ప్రణవికి చెందిన పౌల్ట్రీ ఫామ్ పనులు చేస్తున్నారు. అదే ఫామ్‌లో పనిచేస్తున్న పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన అమరగోని రాజు అజాక్స్ కాంక్రీట్ మిక్సర్ వాహనాన్ని అజాగ్రత్తగా రివర్స్ తీయడంతో అది గోడకు తగిలింది. దీంతో ఆ పక్కనే కూర్చున్న సంపంగి గణేశ్‌పై గోడ కూలడంతో తల నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి తల్లి సంగీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

# లొంగిపోయిన షేక్ చాంద్‌బీ



ఎస్పీ వద్ద లొంగిపోయిన మావోయిస్టు సభ్యురాలు షేక్ చాంద్‌బీ

మహబూబాబాద్ రూరల్, మార్చి 19 : సరెండర్ కమ్ రిహాబిలిటేషన్ పాలసీలో భాగంగా సీపీఐ మావోయిస్టు పార్టీ సభ్యురాలు షేక్ చాంద్‌బీ(జ్యోతక్క) మంగళవారం మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఎదుట లొంగిపోయారు. షేక్ చాంద్‌బీ తొర్రూరు మండలంలో హరిపిరాలలో జన్మించింది. మూడేళ్ల వయసులో ఖానాపూర్ మండలం మనబోతుల గడ్డ గ్రామానికి ఆమె మేనత్త షేక్ ఇమాంబీ చాంద్‌బీని తీసుకువెళ్లారు. నర్సంపేట ఏరియాలో కొంత కాలం ఉంది. అక్కడే మావోయిస్టు కార్యకలాపాల్లో పాల్గొన్నది. అనంతరం 2004లో ఛత్తీస్‌గఢ్ సీపీఐ మావోయిస్టు పార్టీ టైలరింగ్ టీమ్‌లో పనిచేసింది. మావోయిస్టు భావజాలంతో విసుగు చెందడంతోపాటు పార్టీ నాయకులు తమ స్వార్థం కోసం అమాయక ప్రజలను బలి చేస్తున్నారని వాస్తవాలను గ్రహించి జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయించుకొని ఎస్పీ ఎదుట లొంగిపోయారు.